ఏజీపీగా శ్రీనివాస్ బాధ్యతల స్వీకరణ

విశాలాంధ్ర - రాజాం: రాజాం కోర్టులో ఏజీపీగా సీనియర్ న్యాయవాది పి. శ్రీనివాస్ బుధవారం పదవీ బాధ్యతలు చేపట్టారు. ఆర్డర్ కాపీతో కోర్టుకు వచ్చిన ఆయన ముందుగా సీనియర్, జూనియర్ సివిల్ జడ్జిలను కలిసి, తన నియామక పత్రాన్ని అందజేసారు. అనంతరం ఇప్పటివరకు ఏజీపీగా విధులు నిర్వహించిన న్యాయవాది శెట్టి పోలారావు నుంచి బాధ్యతలు స్వీకరించారు. బాధ్యతలు చేపట్టిన శ్రీనివాస్‌ను న్యాయవాదులు శాసపు రమేష్ కుమార్, సూరపునాయుడు, విశ్వేశ్వరరావు, బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షులు కిమిడి సూరపునాయుడు, ఉపాధ్యాయులు కుప్పిలి రమేష్ తదితరులు కలిసి అభినందనలు తెలిపారు.

ఈ ఏడాదికి ఓకే... వచ్చే ఏడాదికి కష్టమే..!

- సంకిలి చక్కెర కర్మాగారం మనుగడ కష్టమే..
- ప్రభుత్వ ఒత్తిడితోనే ఈ ఏడాది కొనసాగింపు..!
- జిల్లాలో భారీగా తగ్గిన చెరుకు సాగు

విశాలాంధ్ర - విజయనగరం: రాష్ట్రంలో సుగర్ ఇండస్ట్రీస్ నష్టాల భారిన పడుతున్నాయి. చివరకు నడవడం కూడా కష్టంగా మారుతున్న నేపథ్యంలో ఇతర పరిశ్రమల ఏర్పాటుపై మక్కువ చూపుతున్నారు. ఇప్పటికే సహకార రంగంలో ఉన్న భీమసింగిని మూసివేయగా, ప్రైవేటు ఆధీనంలో ఉన్న లచ్చయ్యపేట ఎన్‌సీఎస్‌ను పూర్తిగా ఆపివేసారు. ప్రస్తుతం సంకిలి కర్మాగారమే పెద్దదిక్కుగా మారింది. కానీ ఈ పరిశ్రమపైనా నష్టాల నీడలు పడుతున్నాయి. అందులో భాగంగా జిల్లాలో ఉన్న ఏకైక చక్కెర కర్మాగారం సంకిలి ఈఐడి ఫ్యాక్టరీ చక్కెర కర్మాగారం సైతం ఇతర పరిశ్రమల వైపు చూపులు చూస్తోంది. ఇప్పటికే సంకిలి పరిశ్రమ ఈఏడాది నుంచే ఇథనాల్ పరిశ్రమగా మార్చాలని భావించినట్లుగా తెలిసింది. ఈ విషయం తెలుసుకున్న చెరుకు రైతులు, రైతు సంఘాలు తీవ్ర ఆందోళన చెందాయి. పలు ప్రాంతాలలో నిరసన తెలిపాయి. చక్కెర పరిశ్రమ మూత వేయవద్దని కోరారు.

ప్రభుత్వ చర్చలతోనే ఈ ఏడాది క్రషింగ్‌కు అంగీకారం..!

సంకిలి చక్కెర కర్మాగారంలో గత ఏడాది 4లక్షల టన్నులను కష్టంగా గానుగ చేయడం జరిగింది. ఈఏడాది మాత్రం 2.50 లక్షల టన్నుల వరకు క్రషింగ్ చేసేందుకు అవకాశం ఉంది.

దీంతో పరిశ్రమ యాజమాన్యం ఈ ఏడాది క్రషింగ్‌కు వెనుకంజ వేసింది. ఈ సమయంలో రైతుల నుంచి వస్తున్న ఒత్తిడిని ముందుగానే గుర్తించిన ప్రభుత్వం పరిశ్రమ యాజమాన్యంతో చర్చలు జరిపినట్లుగా తెలిసింది. జిల్లా కలెక్టర్ డా.బి.ఆర్.అంబేద్కర్ ఈ విషయంలో ప్రత్యేక శ్రద్ధ వహించి ఈ ఏడాది క్రషింగ్‌కు పరిశ్రమ యాజమాన్యంను ఒప్పించారు. ఈ ఏడాది క్రషింగ్ జరుగుతున్నట్లుగా కలెక్టర్ స్వయంగా ప్రకటించారు.

చెరుకుసాగు విస్తీర్ణం పెంచకపోతే కష్టమే..

జిల్లాలో చెరుకు సాగు దారుణంగా పడిపోయింది. భీమసింగి కర్మాగారం పరిధిలో దాదాపు 2లక్షల టన్నుల చెరుకు క్రషింగ్ జరిగేది. ప్రస్తుతం 10 వేల టన్నులు కూడా రాని పరిస్థితి. ఇదే రీతిలో ఎన్‌సిఎస్ కర్మాగారం పరిధిలో చెరుకు సాగు పడిపోయింది. ఇక సంకిలి కర్మాగారం పరిధిలో సైతం చెరుకు సాగు తగ్గడంతో కర్మాగార యాజమాన్యం ఇథనాల్ పరిశ్రమ వైపు దృష్టిసారించింది. ఈఏడాది 5 లక్షల టన్నుల వరకు చెరుకు లభ్యమయ్యేలా విస్తీర్ణం పెంచాలని జిల్లా కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. ఇది జరిగితే వచ్చే ఏడాదికి క్రషింగ్‌కు ఇబ్బంది లేదని చెప్పవచ్చు. లేని యెడల కర్మాగార మనుగడ కష్టంగా మారుతుందనేది అందరికీ తెలిసిందే.

సీతంలో "శాస్త్రీయ ఆవిష్కరణలు సామాజిక-ఆర్థిక ప్రభావాల"పై సెమినార్

విశాలాంధ్ర - విజయనగరం టౌన్: స్థానిక గాజులరేగ పరిధిలో గల సీతం కళాశాలలో ఆధునిక సమాజాన్ని మరియు ప్రపంచ ఆర్థిక వ్యవస్థను రూపొందించడంలో శాస్త్రీయ ఆవిష్కరణల పరివర్తన పాత్ర యొక్క ప్రాముఖ్యతను బెంగళూరుకు చెందిన నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ అడ్వాన్స్‌డ్ స్టడీస్ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ అన్షుమాన్ బెహరా వివరించారు. శాస్త్రీయ పురోగతి, ఆర్థిక అభివృద్ధి, సామాజిక పరివర్తన, ప్రజా విధానాన్ని ప్రభావితం చేసే బహుముఖ మార్గాలను ఉదహరిస్తూ ఆయన తన దృష్టి కోణాన్ని వివరించారు. డాక్టర్ బెహరా ఒక ప్రముఖ శాస్త్రవేత్త మరియు రక్షణ సంస్థలలో వివిధ స్థాయిలలో పనిచేసిన ప్రతినిధి. భవిష్యత్ విద్య, పరిశోధన సహకారాలను పెంపొందించడానికి ఎన్.ఐ.ఎ.ఎస్, సీతం మధ్య అవగాహన ఒప్పందం (ఎమ్.ఓ.యు) కుదుర్చు కోవడం విషయమై డా. అన్షుమాన్ బెహరాతో చర్చించారు. సీతం డైరెక్టర్ డాక్టర్ మజ్జి శశిభూషణరావు, సీతం విద్యా సంస్థలో తన నైపుణ్యాన్ని పంచుకున్నందుకు డాక్టర్ బెహరా కు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డి.వి.రామమూర్తి, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఉత్తమ విద్యార్థి హరీష్‌ను అభినందించిన లోకేష్

విశాలాంధ్ర - భోగాపురం: ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో చదివి పదోవ తరగతిలో ఉత్తమ మార్కులు సాధించిన ఉత్తమ విద్యార్థులను షైనింగ్ స్టార్స్ పేరుతో విద్యాశాఖ

మంత్రి నారా లోకేశ్ సన్మానించిచారు. దీనిలో భాగంగా భోగాపురం ఆదర్శ పాఠశాలలో పదవ తరగతి చదివిన కొయ్య హరీష్ 593 మార్కులుతో మండలంలో మొదటి ర్యాంకును సాధించి షైనింగ్ స్టార్స్ అవార్డు ను విద్యాశాఖ మంత్రి లోకేష్ చేతుల మీదుగా అందుకొన్నారు. దీనిపై ఆదర్శ పాఠశాల ప్రిన్సిపల్ పార్వతి, ఉపాధ్యాయ సిబ్బంది, విద్యాశాఖాధికారులు హరీష్ ను అభినందించారు.

పెనుబర్తి పాఠశాల స్థాయి పెంపు

విశాలాంధ్ర - గుర్ల: పెనుబర్తి ప్రాథమిక ఉన్నత పాఠశాల స్థాయి పెంచి ఉన్నత పాఠశాలగా మార్చుతున్నట్లు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిందని మండల విద్యాశాఖ అధికారి ఎస్.భాను ప్రకాష్ తెలిపారు. మండలంలో ఇప్పటికే 13 ఉన్నత పాఠశాలలు ఉన్నాయని, పెనుబర్తితో 14కి చేరిందన్నారు. ఇక్కడ 182 మంది విద్యార్థులు చదువుతున్నారని, ఉన్నత పాఠశాల కావడంతో పిల్లలను చేర్పించాలని ఉపాధ్యాయులు, విద్యా కమిటీ సభ్యులు కోరుతున్నారు.

అంబేద్కర్ చరిత్రను ప్రజలకు అందిస్తాం

విశాలాంధ్ర - శృంగవరపుకోట రూరల్: బాబాసాహేబ్ డా. బి.ఆర్.అంబేద్కర్ పోరాట చరిత్రను ప్రజలకు అందించే లక్ష్యంతో ప్రజా వాగ్గేయకారుడు ఆతవ ఉదయ భాస్కర్ "అంబేద్కర్ ఎవరు? ఆయన ఏం చేశారు" అనే పుస్తకాన్ని శృంగవరపు కోటలోని అంబేద్కర్ విగ్రహం వద్ద ఆవిష్కరించారు. 2025లో 50 వేల పుస్తకాలను ఉచితంగా పంపిణీ చేస్తామని వారు ప్రకటించారు. మతాలు మాసిపోతాయి, కులాలు కూలిపోతాయి, కానీ జ్ఞానం మాత్రమే మిగులుతుంది అనే అంబేద్కర్ ఆశయాలను ప్రచారం చేయడమే ఈ కార్యక్రమం ఉద్దేశం అని భాస్కర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో డీలర్ల సంఘం అధ్యక్షుడు బుగత వెంకటేశ్వరరావు, ఉద్యమ నాయకులు డప్పురాజు, బోనెల ఈశ్వరరావు, కపరెడ్డి వెంకట అప్పారావు, మెయ్యి వెంకటరమణ పాల్గొన్నారు.

మండల టీడీపీ అధ్యక్షుడిగా రౌతు

విశాలాంధ్ర - చీపురుపల్లి: చీపురుపల్లి మండల టీడీపీ అధ్యక్షుడిగా రౌతు కామ నాయుడును నియమిస్తున్నట్లు చీపురుపల్లి ఎమ్మెల్యే మాజీ మంత్రి, టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు కిమిడి కళా వెంకట్రావు నియోజకవర్గ మినీ మహానాడు కార్యక్రమంలో ప్రకటించారు. ఈ నియామకంతో రౌతు కామ నాయుడు మండల టీడీపీ అధ్యక్షుడిగా ఏడోసారి బాధ్యతలు చేపట్టనున్నారు. టీడీపీ అధికారం కోల్పోయి ప్రతిపక్షంలో ఉన్నప్పుడు 2004 నుండి రౌతు కాము నాయుడు మండల పార్టీ అధ్యక్షులు బాధ్యతలను, గతంలో పట్టణ పార్టీ అధ్యక్షుడు గాను , జిల్లా పార్టీ ఉపాధ్యక్షుడు గాను బాధ్యతలను నిర్వహించారు. రౌతు టీడీపీలో చేరినప్పటి నుంచి తన సొంత నిధులను వెచ్చించి అర్హత ఉండి పెన్షన్ల మంజూరు కానీ వృద్ధులకు పెన్షన్ పంపిణీ కార్యక్రమం చేసేవారు. రౌతు కామ నాయుడు సతీమణి చీపురుపల్లి మండల అధ్యక్షురాలుగా పనిచేశారు. రౌతు చీపురుపల్లి మండలంలో ఎంపీటీసీగా ప్రాతినిధ్యం వహిస్తూ మండల పార్టీ అధ్యక్ష బాధ్యతలను పార్టీ సిద్ధాంతాలకు కట్టుబాట్లకు లోబడి నిర్వహించారు.

నేడు విజయనగరంలో హనుమాన్ శోభాయాత్ర

విశాలాంధ్ర - విజయనగరం ఫోర్ట్: శ్రీ హనుమాన్ జయంతి సందర్భంగా హిందూ ధర్మ రక్ష సమితి ఆధ్వర్యంలో హనుమాన్ శోభయాత్ర విజయనగరం పట్టణంలో గురువారం ఘనంగా నిర్వహిస్తున్నట్టు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎన్.వేణుగోపాల్‌రావు, రాష్ట్ర వైస్ ప్రెసిడెంట్ శ్యామ్ సుందర్ తెలిపారు. స్థానిక కోదండ రామ కళ్యాణ మండపంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ గత మూడేళ్లుగా ఈ హనుమాన్ శోభయాత్ర ఘనంగా చేస్తూ నాలుగో ఏడాది మరింత ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేసామని తెలిపారు. ఈ హనుమాన్ శోభయాత్ర గురువారం సాయింత్రం ఐదు గంటలకు కోట దగ్గర బయలుదేరుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ సాధు పరిషత్ అధ్యక్షులు శ్రీనివాసనంద సరస్వతి, సినీ నటి కళ్యాణి ఇతర ప్రముఖులు పాల్గొంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్ధ సారథి, నరేష్, రాజేష్, ముత్యాల నాయుడు, లోకేష్ తదితరులు పాల్గొన్నారు.

ఏజెన్సీలో జ్వరాల తీవ్రతపై ఐటీడీఏ దృష్టి పెట్టాలి

గిరిజనులకు మెరుగైన వైద్యం అందించాలి

రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ డాక్టర్ డివిజి శంకర్రావు

విశాలాంధ్ర - విజయనగరం టౌన్: ఏజన్సీలో గిరిజనులు జ్వరాలతో అనారోగ్యం పాలవుతున్నారని వారికి సరైన వైద్యం అందేలా అధికార యంత్రాంగం చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ డాక్టర్ డివిజి శంకరరావు అన్నారు. పార్వతీపురం మన్యం జిల్లాతోపాటు అల్లూరి సీతారామరాజు జిల్లాలో జ్వరాల తీవ్రత ఎక్కువగా ఉందన్న పత్రికా కథనాలపై డాక్టర్ శంకరరావు స్పందించారు. మన్యం జిల్లాలో గుమ్మలక్ష్మీపురం, సాలూరు, కురుపాం తదితర ఏజన్సీ ప్రాంతాల్లో జ్వరాల తీవ్రత ఎక్కువ ఉందన్నారు. తన క్షేత్ర స్థాయి పర్యటనలలో కూడా అనేక మంది గిరిజనులు జ్వరాలతో బాధపడుతున్న పరిస్థితులు గమనించడం జరిగిందని తెలిపారు. అయితే చాలా ప్రాంతాల్లో గిరిజనులు వ్యాధుల బారిన పడితే సమీప పిహెచ్‌సిలకు వెళ్లేందుకు ఇబ్బందులు పడుతున్న పరిస్థితి వుందన్నారు. ఈ నేపథ్యంలో సీజనల్ వ్యాధులు మరింత ప్రబలకుండా గ్రామ స్థాయిలోనే చర్యలు చేపట్టాల్సి వుందన్నారు. తాగునీరు, పారిశుద్ధ్యం వంటి అంశాలపై క్షేత్ర స్థాయిలో చర్యలు చేపట్టడమే కాకుండా, అవసరమైన సందర్భాలలో వైద్య శిబిరాలు కూడా నిర్వహించాల్సి వుందన్నారు. ఐటీడీఏ అధికారులు క్షేత్ర స్థాయి సిబ్బంది నుంచి ఎప్పటికప్పుడు ప్రజల ఆరోగ్య సమాచారాన్ని తెలుసుకుని, వెంటనే స్పందించాలన్నారు. ప్రధానంగా వైద్య సదుపాయాలకు దూరంగా ఏజన్సీ ప్రాంతవాసులపై సంబంధిత జిల్లా కలెక్టర్లు, ఐటిడిఎ అధికారులు దృష్టి సారించి తగిన చర్యలు చేపట్టాలన్నారు.

యోగా జీవితంలో భాగం కావాలి: కలెక్టర్ అంబేద్కర్

విశాలాంధ్ర - విజయనగరం కంటోన్మెంట్: యోగాంధ్ర సాధన లక్ష్యంగా ప్రభుత్వం చేపట్టిన యోగాభ్యాస కార్యక్రమానికి జిల్లాలో శ్రీకారం చుట్టారు. దీనిలో భాగంగా నెల రోజులపాటు నిర్వహించనున్న యోగా మంత్ కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ ప్రారంభించారు. యోగా ప్రతీ ఒక్కరి జీవితంలో భాగం కావాలని ఆయన పిలుపునిచ్చారు. స్థానిక రాజీవ్ క్రీడా మైదానంలో యోగా భ్యాస కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ అంబేద్కర్, ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులనాయుడు, జెసి ఎస్.సేతు మాధవన్ బుధవారం ప్రారంభించారు. జూన్ 21న 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవం దేశవ్యాప్తంగా భారీ ఎత్తున జరగనుంది. రాష్ట్రంలో జూన్ 21 విశాఖపట్నంలో అత్యంత ప్రతిష్టాత్మకంగా జరిగే ఈ వేడుకకు ప్రధాని నరేంద్ర మోడీ హాజరు కానున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ అంబేద్కర్ మాట్లాడుతూ ప్రతీఒక్కరి జీవితంలో యోగా ఒక భాగం కావాలని కోరారు. మన ప్రాచీన సంస్కృతిలో యోగా ఒక భాగమని, దీనిని అందరూ అభ్యసించాల్సిన అవసరం ఉందని అన్నారు.

దీనిని ప్రపంచవ్యాప్తంగా ప్రాచుర్యం కల్పించాలన్న ఉద్దేశ్యంతో పదేళ్ల క్రితం గౌరవ ప్రధాని నరేంద్ర మోది యోగా దినోత్సవానికి శ్రీకారం చుట్టారని చెప్పారు. జూన్ 21న జరిగే ప్రపంచ యోగా దినోత్సవ కార్యక్రమానికి ప్రధానమంత్రి మన రాష్ట్రానికి రావడం ఎంతో గౌరవదాయకమని పేర్కొన్నారు.

యోగాకు జిల్లా స్థాయి నుంచి గ్రామస్థాయి వరకు విస్తృత ప్రాచుర్యాన్ని కల్పించి, ప్రతీఒక్కరిచేతా యోగాసనాలను అభ్యసన చేయించే ఉద్దేశ్యంతో ఈ రోజు నుంచి నెల రోజులపాటు భారీ ఎత్తున కార్యక్రమాలను నిర్వహిస్తామని కలెక్టర్ చెప్పారు. ఉపాధ్యాయ ఎంఎల్‌సి గాదె శ్రీనివాసుల నాయుడు మాట్లాడుతూ ఆరోగ్యమే మహా భాగ్యమని, ఆరోగ్య సాధనకు యోగా ఒక చక్కని మార్గమని అన్నారు. జాయింట్ కలెక్టర్ ఎస్.సేతు మాధవన్ మాట్లాడుతూ యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా వారానికో ప్రచార కార్యక్రమాన్ని రూపొందించినట్లు తెలిపారు. మొదటి వారం జిల్లా స్థాయిలో, రెండో వారం మండల స్థాయిలో అధికారులకు శిక్షణ ఇస్తామన్నారు. వారి ద్వారా మూడో వారం జిల్లా స్థాయిలో శిక్షణా కార్యక్రమాలను నిర్వహిస్తామని చెప్పారు. ఐదు లేదా మూడు రోజుల శిక్షణా కార్యక్రమాన్ని రూపొందిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిఆర్‌డిఏ పిడి ఎ.కల్యాణచక్రవర్తి, డిఎస్‌డిఓ ఎస్.వెంకటేశ్వర్రావు, ఆయుష్ వైద్యాధికారులు డాక్టర్ వరప్రసాద్, డాక్టర్ ఆనందరావు, డాక్టర్ స్వప్న చైతన్య, పలువురు జిల్లా అధికారులు, యోగా శిక్షకులు, విద్యార్థులు, వివిధ సంస్థలు, అసోసియేషన్ల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు. ఇటీవల అరకులో నిర్వహించి, ప్రపంచ రికార్డు సాధించిన మెగా యోగా కార్యక్రమం మహా సూర్యవందనంలో జిల్లా నుంచి పాల్గొన్నవారికి ఈ సందర్భంగా కలెక్టర్ చేతులమీదుగా సర్టిఫికేట్లను అందజేశారు.

బినామీ మస్తర్లు వేస్తున్న మేట్లపై చర్యలు తీసుకోవాలి

విశాలాంధ్ర - గంట్యాడ: గంట్యాడ మండల పరిషత్ సర్వసభ్య సమావేశం బుధవారం ఎంపీపీ పీరుబండి హైమావతి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా అధికారులు వారి వారి ప్రగతి నివేదికలు చదివి వినిపించారు. అలాగే ఏపీవో సుందర్రావు తమ శాఖ నివేదికను చదివి వినిపిస్తుండగా నరవ సర్పంచ్ ప్రతివాడ భాస్కరరావు ఉపాధి హామీ మస్టర్లపై సమస్యను లేవనెత్తారు. నరవ గ్రామంలో ఉపాధి పనులకు వెళ్లకుండా ఉద్యోగాలు, బయట వివిధ రకాలైన వ్యాపారాలు చేసుకుంటూ మస్తర్లు వేయించుకుంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. వెంటనే ఎంపీపీ హైమావతి స్పందించి బినామీ మస్తర్లు వేస్తున్న మేట్లపై తక్షణమే చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో ఆర్‌వి రమణమూర్తికి ఆదేశిం చారు. సర్పంచ్ భాస్కరరావు ఎంపీపీ, ఎంపీడీవోలకు వినతి పత్రం అంద జేశారు. సమగ్ర విచారణ చేసి బినామీ మస్తర్లు వేస్తున్న మేట్లపై చర్యలు తీసుకుంటామని చెప్పారు. తహశీల్దార్ నీలకంటేశ్వర్ రెడ్డి రెవెన్యూ శాఖ ప్రగతిని వివరిస్తూ సిరిపురం జగ్గాపురం గ్రామాలలో రీ సర్వే జరుగుతుందని డాక్యుమెంట్లు తీసుకుని వెళ్లి తమ భూములను సిబ్బందికి చూపించి సరి చేసుకోవా లన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ వర్రీ నరసింహమూర్తి, జిల్లా ఎస్సీ సెల్ చైర్మన్ పీరుబండి జైహింద్ కుమార్ వివిధ శాఖల మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

లక్ష్యసాధన కోసం కసితో ముందుకు సాగాలి

సైనిక సంక్షేమ శాఖ అధికారి మజ్జి

విశాలాంధ్ర - జామి: సమాజంలో నేటి తరం విద్యార్థులకి అనేక సవాళ్లు ఉన్నప్పటికీ లక్ష్యసాధనకు విద్యార్థులు కసిగా కృషి చేయాలని విజయనగరం జిల్లా సైనిక సంక్షేమ శాఖ అధికారి మజ్జి కృష్ణారావు అన్నారు. బుధవారం మండలంలోని అట్టాడ బి.ఎన్. ఆర్.అశ్రమంలో జిల్లా పౌర వేదిక, ఎన్.వి.ఎన్. బ్లడ్ బ్యాంక్, సంయుక్తంగా మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో పది పరీక్షలో ప్రథమ, ద్వితీయ, తృతీయ శ్రేణుల్లో సత్తా చాటిన విద్యార్థులకు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు నిరంతరం జాతీయ, అంతర్జాతీయ విజేతల జీవిత ఘట్టాలు చదవాలని వారి నుండి స్ఫూర్తి పొందాలని అన్నారు. విశ్రాంత చీఫ్ బ్యాంకింగ్ అధికారి పిడకల ప్రభాకరరావు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశా లల్లో చదివి ఉత్తమ ప్రతిభను చూపిన విద్యార్థులను చూస్తుంటే చాలా గర్వంగా ఉందని చదువుతోపాటుగా విద్యార్థులకి క్రమశిక్షణ చాలా ముఖ్యమని అన్నారు. పాఠశాలలు వారిగా ప్రతిభను కనబర్చిన విద్యార్థులను వారి తల్లిదండ్రులను, ఉపాధ్యాయులను అతిథులు ఘనంగా సన్మానించారు. మండలంలోని కెజీబివి కుమరాం, జిల్లా పరిషత్ హైస్కూలు కుమరాం, జామి, విజినిగిరి, లొట్లపల్లి, అలమండ బాయిస్, గర్ల్స్, విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సమావేశంలో పౌర వేదిక అధ్యక్షుడు భీశెట్టి బాబ్జి,ఎన్.వి.ఎన్. బ్లడ్ బ్యాంక్ అధినేత తాడేపల్లి నాగేశ్వరరావు, తుమ్మగంటి రాంమోహన్ రావు, ఇప్పలవలస గోపాలరావు, ఆశ్రమం నిర్వాహకులు భీశెట్టి శారదా, ఆదారి హరిత సాయి, తదితరులు పాల్గొన్నారు.

రెడ్డీస్ లేబ్ ఆధ్వర్యంలో జాబ్‌మేళా

విశాలాంధ్ర - మెరకముడిదాం: మెరకముడిదాం మండలం సోమలింగాపురం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో రెడ్డీస్ ల్యాబ్ ఆధ్వర్యంలో జాబ్ మేళాను బుధవారం నిర్వహించారు. ఈ జాబ్ మేళా రెడ్డీస్ సంస్థకు సంబంధించిన హెచ్ ఆర్ డిపార్టుమెంటు వారు నిర్వహి ంచారు. జాబ్ మేళాకు 70 మంది విద్యార్థులు హాజరు కాగా 23 మందిని రెడ్డీస్ ల్యాబ్ సంస్థ ప్రతినిధులు నాగేశ్వరరావు, ప్రతాప్ రెడ్డిలు ఎంపిక చేశారు. ఈ సందర్భంగా ప్రతినిధులు మాట్లాడుతూ భవిష్యత్‌లో మా సంస్థ నుండి నిరుద్యోగ యువతకు మంచి అవకాశం కల్పించటం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు, స్థానిక టీడీపీ నాయకులు రామ్మూర్తి రాజు, వెంకటపతి రాజు, (నాని) బంగారు రాజు, తదితరులు పాల్గొన్నారు.

జయంతి రామలక్ష్మణ మూర్తికి ఘన నివాళి

విశాలాంధ్ర - విజయనగరం రూరల్: నడయాడే గ్రంథాలయంగా పేరొందిన జిల్లాకు చెందిన గ్రంథాలయోద్యమ నాయకులు జయంతి రామలక్ష్మణ మూర్తి వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. బుధవారం గురజాడ స్మారక జిల్లా కేంద్ర గ్రంథాలయంలో వున్న జయంతి రామలక్ష్మణ మూర్తి విగ్రహానికి సంఘం అధ్యక్షులు కె.ఎర్నాయుడు, వ్యవస్థాపకులు అబ్దుల్ రవూఫ్, గౌరవ అధ్యక్షులు నాలుగెస్సులరాజు, ఉపాధ్యక్షులు కె.దయానంద్‌లు పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రంథాలయాలపై అవగాహన కల్పించేందుకు, పుస్తకపఠనం పెంపొందించేందుకు జయంతి రామలక్ష్మణ మూర్తి విశేష కృషి చేసారని అన్నారు. కార్యక్రమంలో గురజాడ గ్రంథాలయం సిబ్బంది శ్రీనివాస్, అప్పలనాయుడు, విద్యార్థులు పాల్గొన్నారు.

పది విద్యార్థులకు నగదు పురస్కారం

విశాలాంధ్ర - బొబ్బిలి: పట్టణంలో గల కొప్పుల వెలమ సామాజిక భవనంలో కొప్పుల వెలమ సేవా సంఘం ఆధ్వర్యంలో నియోజకవర్గంలో 10వ తరగతి ఫలితాల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించిన విద్యార్థులకు అభినందన సభ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ

కార్యక్రమానికి ముఖ్య అతిధిగా మాజీ ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు హాజరయ్యారు. సభను ఉద్దేశించి మాజీ ఎమ్మెల్యే శంబంగి మాట్లాడుతూ చదువులో విద్యార్థులను పోత్సహించడం ద్వారా ఉన్నత చదువులు చదివి జీవితంలో అభివృద్ధి చెందుతారని ప్రతిఒక్కరి తల్లిదండ్రులు తమ పిల్లలను ఉన్నత చదువులు చదివించాలని సూచించారు. అనంతరం ఇటీవల పదవ తరగతి పరీక్ష ఫలితాల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించిన విద్యార్థులకు ప్రశంసా పత్రాలు, జ్ఞాపికలు, నగదు పురస్కారాన్ని అందజేశారు.

రాజీవ్ గాంధీకి ఘన నివాళులు

విశాలాంధ్ర - శృంగవరపుకోట: మండల కాంగ్రెస్ నాయకులు మాజీ ప్రధానమంత్రి రాజీవ్ గాంధీకి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కాంగ్రెస్ కమిటీ కార్యదర్శి హెచ్.నానాజీ మాట్లాడుతూ రాజీవ్ గాంధీ చేసిన సేవలను స్మరించుకున్నారు. అతని కీర్తిని సమాజంలోని ప్రతి ఒక్కరు తెలుసుకోవాలని, అతని అడుగుజాడల్లో నడవాలని, దేశానికి అందించిన సేవలను గౌరవించాలని ఆయన ప్రత్యేకంగా పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు చింతల ఈశ్వరరావు, సీనియర్ నాయకులు పి.మనీబాబు తదితరులు పాల్గొన్నారు.

నగరపాలక సంస్థ పరిధికి స్వాగతం తెలిపే విధంగా శివారు ప్రాంతాలలో స్వాగత బోర్డులను కమిషనర్ పల్లి నల్లనయ్య ఆదేశాలతో అధికారులు అమర్చారు. జేఎన్టీయూ జంక్షన్, పెదతాడివాడ జంక్షన్, మిమ్స్ హాస్పటల్ జంక్షన్, విటి అగ్రహారం జంక్షన్ ప్రాంతాల్లో స్వాగత బోర్డులను ఏర్పాటు చేశారు. దీంతో కొత్త శోభ సంతరించుకున్నట్లయింది.
(విశాలాంధ్ర - విజయనగరం)

కలెక్టర్ చొరవతో జిల్లాకు సి.ఎస్.ఆర్ నిధులు

విశాలాంధ్ర - విజయనగరం: జిల్లాలో అభివృద్ధి కార్యక్రమాల కోసం సి.ఎస్.ఆర్. క్రింద నిధులు సమకూర్చేందుకు పలు కంపెనీలు ముందుకు వచ్చాయి. జిల్లా కలెక్టర్ డా.బి.ఆర్.అంబేద్కర్ చొరవతో అనేక అభివృద్ధి కార్యక్రమాల కోసం సి.ఎస్.ఆర్ నిధులు కేటాయించడం జరిగింది. ప్రధానంగా విద్య, వైద్య రంగాలకు నిధులు కేటాయించడం జరిగింది. న్యూక్లియర్ పవర్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా వారు మెడికల్ కళాశాలలో మెడికల్ ఎక్విప్మెంట్ కోసం కోటి రూపాయలు, అదే విధంగా పూసపాటి రేగ మండలంకు చెందిన నడివల్లి, చింతపల్లి గ్రామాల్లో ప్రభుత్వ పాఠశాలల్లో అదనపు తరగతి గదులు కోసం 54.50 లక్షల రూపాయలను, భారత్ డైనమిక్ లిమిటెడ్ కంపెనీ క్లాస్ రూమ్ ప్రాజెక్ట్ కోసం 37 ప్రభుత్వ పాఠశాలలకు కోటి రూపాయలు, సాంఘిక సంక్షేమ వసతి గృహాల్లో మౌలిక వసతుల కోసం 14.50 లక్షలు, గజపతినగరం ఏరియా ఆసుపత్రిలో మెడికల్ ఎక్విప్మెంట్ కోసం 7.16 లక్షల రూపాయలను మంజూరు చేసింది. పవర్ గ్రిడ్ కార్పొరేషన్ వారు ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ద్వారా నడపబడుచున్న బ్లడ్ బాంక్‌కు జనరేటర్ కోసం 11.34 లక్షల రూపాయలను, బదిర బాలికల కోసం 45 బంకర్ బెడ్స్‌ను, 4 ఆర్.ఓ ప్లాంట్‌లను కూడా మంజూరు చేయడం జరిగింది. చంపావతి నదీ పరివాహక ప్రాంతంలో నున్న నెల్లిమర్ల, గరివిడి, గుర్ల, మెరకముడిదాం మండలాల్లో గల 40 చెరువుల అభివృద్ధికి 15 కోట్ల రూపాయలను యాక్సిస్ బాంక్ సి.ఎస్.ఆర్ క్రింద మంజూరు చేసింది.

ప్రజలకు మెరుగైన సేవలందించాలి నగరపాలక కమిషనర్ కిల్లాన

విశాలాంధ్ర - విజయనగరం: రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన ప్రాధాన్యత అంశాలను ప్రజల ముంగటికే తీసుకెళ్లి మెరుగైన పౌర సేవలు అందించాలని సచివాలయ సిబ్బందికి విజయనగరం నగరపాలక సంస్థ సహాయ కమిషనర్ కిల్లాన అప్పలరాజు సూచించారు. బుధవారం 6,32వ నెంబర్ల సచివాలయాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. అయితే కొన్నిచోట్ల విజిటింగ్ పుస్తకాలు లేకపోవడంపై సిబ్బందిని మందలించారు. రిజిస్టర్ల నిర్వహణ సరిగా లేదని గుర్తించారు. ఈ విషయమై కార్యదర్శులకు తగు సూచనలు జారీ చేశారు. సచివాలయ కార్యాలయం తో పాటు ఆవరణలు కూడా పరిశుభ్ర వాతావరణంలో ఉంచాలని సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మెరుగైన పౌర సేవలు అందించడమే సచివాలయాల ముఖ్య ఉద్దేశమని తెలిపారు. ప్రజా ఫిర్యాదులను తక్షణమే పరిష్కరించే దిశగా కార్యదర్శులకు సూచించామని చెప్పారు. అందరి సహకారంతో పురసేవలు మెరుగుపరిచేందుకు మరింత కృషి చేస్తున్నామని అన్నారు.

నూతన కోర్టు భవన నిర్మాణంలో అన్ని సౌకర్యాలతో డిజైన్ చేయాలి

జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎం.బబిత

విశాలాంధ్ర - శృంగవరపుకోట: శృంగవరపుకోటలో నూతన కోర్టు భవన నిర్మాణంలో అన్ని సౌకర్యాలు ఉండేలా డిజైన్ రూపొం దించాలని రోడ్లు భవనాల శాఖ (ఆర్ అండ్ బి) ఇంజినీర్లను జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎం.బబిత ఆదేశించారు. ఎస్.కోట పట్టణంలో ప్రస్తుతం కొనసాగుతున్న అద్దె కోర్టు భవనం, శిథిలమైన పాత కోర్టు భవనాలు, మేజిస్ట్రేట్ క్వార్టర్‌ను జిల్లా ప్రధాన న్యాయమూర్తి బబిత బుధవారం పరిశీలించారు. కోర్టు భవనం పరిశీలనకు వచ్చిన జిల్లా జడ్జికి ఎస్.కోట జూనియర్ సివిల్ జడ్జి బి.కనకలక్ష్మి, న్యాయవాదుల సంఘ అధ్యక్షుడు జి.సూరిదేముడు పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. అనంతరం జిల్లా జడ్జి ఆర్ అండ్ బి ఇంజినీర్లు కోర్టు నూతన భవనం, మేజిస్ట్రేట్ క్వార్టర్ నిర్మాణానికి రూపొందించిన డిజైన్లను జిల్లా జడ్జి పరిశీలించారు. అనంతరం డీజే మాట్లాడుతూ నూతన కోర్టు ప్రాంగణంలో ఫిజికల్లీ చాలెంజ్డు కోసం ప్రవేశ ద్వారం, ట్రాన్స్ జెండర్లు, ఫిజికల్లీ ఛాలెంజ్ వ్యక్తులకు ప్రత్యేక టాయిలెట్స్, న్యాయవాదులు, కక్షిదారుల వాహనాల పార్కింగ్ కోసం సౌకర్యాలు ఉండేలా చూడాలని ఇంజినీర్లకు సూచించారు. ఇక నూతన కోర్టు భవనాలకు రూ.8.5కోట్లు, మేజిస్ట్రేట్ నివాస గృహం కోసం రూ.2.23కోట్లు, పాత భవనాల తొలగింపు కోసం రూ.7లక్షల నిధుల కేటాయింపు కొరకు ప్రస్తుత డిజైన్లు రూపొందించామని ఆర్ అండ్ బి ఇంజినీర్లు ఎస్.కోట సెక్షన్ ఏఈ స్వామి, ఎల్.కోట సెక్షన్ ఏఈ శ్రీనివాస్ వెల్లడించారు. అలాగే ఎస్.కోట నూతన కోర్టు నిర్మాణం జి౦2 విధానంలో ఉంటుందని, కోర్టు ప్రాంగణంలో ఏటీఎం, ప్రత్యేక కక్షిదారుల కోసం బాత్ రూములు, మరుగుదొడ్లు వంటివి డిజైన్ లో రూపొందించినట్టు ఇంజనీరింగ్ అధికారులు జిల్లా జడ్జికి వివరించారు. ఇక కొత్తవలస కోర్టు ప్రాంగణంలో కక్షిదారుల కోసం ప్రత్యేక బాత్ రూముల నిర్మాణానికి రూ.4లక్షల నిధులు మంజూరుకు ప్రతిపాదించామన్నారు. ఇదిలావుండగా ఎస్.కోట నూతన కోర్టు భవనాల కోసం రూపొందించిన డిజైన్లను మరోదఫా పరిశీలించిన అనంతరం ఫైనలైజ్ చేసి హైకోర్టుకు నివేదించనున్నట్టు జిల్లా ప్రధాన న్యాయమూర్తి బబిత స్పష్టం చేశారు. కాగా బార్ అసోసియేషన్ హాలును జిల్లా జడ్జి పరిశీలించిన అనంతరం న్యాయవాదులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా న్యాయవాదుల సంఘ అధ్యక్షుడు సూరిదేముడు, కార్యదర్శి టీవీఎస్ రామారావు ఎస్.కోట కోర్టుకు అవసరమైన అకౌంటెంట్, ఇతర ఖాళీ పోస్టులను త్వరితంగా భర్తీ చేయాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తిని కోరారు. ఇక ఎస్.కోట జూనియర్ సివిల్ జడ్జిగా నూతన బాధ్యతలు స్వీకరించిన కనకలక్ష్మికి న్యాయవాదులు పూర్తిగా సహకరించి త్వరితగతిన కేసుల పరిష్కారానికి చేయూతనందించాలని జిల్లా జడ్జి బబిత సూచించారు. పాత కోర్టు భవన పరిశీలనలో జిల్లా జడ్జి బబిత వెంట ఎస్.కోట మేజిస్ట్రేట్ బి.కనకలక్ష్మి, సెకెండ్ క్లాస్ మేజిస్ట్రేట్ జి.అప్పలనాయుడు, సీనియర్ న్యాయవాదులు ఎన్టీవీ దాసు, జి.ప్రకాష్, బి.త్రిమూర్తులు, ఎం.దొరబాబు, డబ్ల్యు.ఎస్. శర్మ, వారాది ఈశ్వరరావు, టీవీఆర్ మూర్తి, బి.వెంకటరావు, బి.రామకృష్ణ, సీహెచ్ఆర్ఏ నాయుడు, జి.చిట్టిబాబు, సంతోష్, శేఖర్ తదితరులు ఉన్నారు.

ప్రతి ఒక్కరికి ఓటు హక్కు కల్పించే బాధ్యత తీసుకోవాలి

రెవెన్యూ డివిజనల్ అధికారి ఆశయ్య

విశాలాంధ్ర - చీపురుపల్లి: 18 ఏళ్ల నిండిన యువతి యువకుల అందరికీ ఓటు హక్కు కల్పించే బాధ్యతను ప్రతి ఒక్కరు తీసుకోవాలని రెవెన్యూ డివిజనల్ అధికారి ఆశయ్య అన్నారు. ఎలక్షన్ కమీషన్ ఆఫ్ ఇండియా, ప్రధాన ఎన్నికల అధికారి, ఆంధ్రప్రదేశ్, కలెక్టరు, జిల్లా ఎన్నికల అధికారి, విజయనగరం వారి ఆదేశాల మేరకు వాటర్ల చేర్పులు మార్పులు ఇతర అంశాలపై చీపురుపల్లి తహసిల్దార్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఓటర్లను చేర్చుటకు, వోటింగ్ ప్రక్రియలో వారికి స్వేచ్ఛాయుతమైన, అనుకూలమైన వాతావరణం కల్పించుటకుగాను ప్రతీ త్రైమాసికంలో అసెంబ్లీ నియోజకవర్గ స్థాయిలో సమావేశం నిర్వహించాలని ఆయన అన్నారు. ఏసిసిఏఈ సమావేశంలో భాగంగా ఈరోజు నిర్వహించిన సమావేశంలో సభ్యులతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు.. ఈ సమావేశానికి నెం.15 చీపురుపల్లి నియోజకవర్గం ఏసీసీఏఈ కమిటీ సభ్యులైన ఎన్.రాజారావు, తహశీల్దారు, చీపురుపల్లి త్రినాద్, ఎంపీడీఓ, చీపురుపల్లి బూసినాయుడు, ఎంఈఓ, చీపురుపల్లి యశోదన రావు, అసిస్టెంట్ బి.సి.వెల్ఫేర్ ఆఫీసర్, చీపురుపల్లి, బి.వి.గోవింద రాజులు మానవీయ స్వచ్ఛంద సేవా సంస్థ టి.లక్ష్మణరావు, రామునాయుడు, పీడబ్ల్యుడి ప్రతినిధులు హాజరయ్యారు.

మామిడిపండ్లు నిల్వ దుకాణాల్లో విజిలెన్స్ తనిఖీలు

రసాయనాలను వినియోగించే వారిపై కేసులు

విశాలాంధ్ర - గంట్యాడ /విజయనగరం: ప్రాంతీయ నిఘా మరియు అమలు అధికారి బి.ప్రసాదరావు వారి ఆదేశాల మేరకు విజయనగరం జిల్లా గంట్యాడ మండలం రామవరం గ్రామం నందు గల కాకర్లపూడి రామకృష్ణ రాజు, సిరిపురపు శివ అనే వ్యక్తుల ఇంటివద్ద గల గది / పాకలో విజిలెన్స్, ఆహార భద్రత అధికారులు కలిసి సంయుక్త తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో రామకృష్ణ రాజు, సిరిపురపు శివ తాము పండించిన మామిడి కాయలకు మంచి రంగు రావడానికి, ఆకర్షణీయంగా కనపడటానికి తద్వారా పళ్ళను ఎక్కువ ధరకు అమ్ముకొనుటకు గాను మామిడి కాయలకు కెమికల్ ద్రావకంలను ఉపయోగించి దానిలో మామిడి కాయలను ముంచి లేదా మామిడికాయలపై స్ప్రే చేయడం వల్ల, రంగు వచ్చిన తరువాత లోకల్ మార్కెట్‌లో అమ్మడం చేస్తుంటారని అధికారులు గుర్తించారు. ఈ సందర్భంగా విజిలెన్స్ అధికారులు మాట్లాడుతూ ఈ విధముగా

కృత్రిమంగా కెమికల్స్ వాడి మామిడికాయలు పండించరాదని, ఆ విదంగా పండించడం వల్ల ప్రజల ఆరోగ్యం దెబ్బ తింటుందని, కృత్రిమంగా కెమికల్స్ వాడి మామిడికాయలు పండించే వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని తెలియపరిచారు. ఈ తనిఖీలలో విజిలెన్స్ అధికారులు సింహాచలం సిఐ, కామేశ్వరరావు హెచ్‌సి, పురుషోత్తం, పీసీ, ఆహార భద్రత అధికారులు పాల్గొన్నారు.

ఎస్.కోటలో యోగాంధ్ర దినోత్సవం

విశాలాంధ్ర - శృంగవరపుకోట రూరల్: శృంగవరపుకోట కేంబ్రిడ్జ్ నారాయణ పాఠశాలలో జరుగుచున్న వేసవి బ్యాడ్మింటన్ శిక్షణ శిబిరంలో బుధవారం ఉదయం చీఫ్ కోచ్ డాక్టర్ పొట్నూరు శ్రీరాములు ఆధ్వర్యంలో ఎమ్మెల్సీ, జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ చైర్మన్ ఇందుకూరి రఘురాజు

యోగాంధ్ర దినోత్సవంను ముఖ్యఅతిథిగా పాల్గొని బ్యాడ్మింటన్‌లో శిక్షణ పొందుతున్న 105 మంది క్రీడాకారులతో యోగా సూర్య నమస్కారాలతో ప్రారం భించారు. ఈ సందర్భంగా ఇందుకూరు రఘురాజు మాట్లాడుతూ ఈ యోగాంధ్ర దినోత్సవం నేటి నుండి నెల రోజులు పాటు కొనసాగి జూన్ 21వ తేదీన జరిగే ప్రపంచ యోగ దినోత్సవంతో ముగుస్తుందని, యోగా వలన అనేక లాభాలు ఉన్నాయని మానసికంగా శారీరకంగా, మెంటల్ గా, వ్యక్తి మానసిక వికాసానికి ఎంతగానో యోగ దోహదపడుతుందని, రోజు ప్రజలందరూ ఉదయాన్నే ఒక గంట పాటు యోగా చేయడం వలన రోజంతా మానసిక ప్రశాంతతతో గడుపుతారని అన్నారు. ఈ సందర్భంగా చీఫ్ కోచ్ డాక్టర్ పొట్నూరు శ్రీరాములు మాట్లాడుతూ శిక్షణ శిబిరంలో ఉండే క్రీడాకారులందరితో ఉదయాన్నే యోగ మెడిటేషన్ చేయిస్తున్నాము . యోగా వలన క్రీడాకారులు మానసిక ప్రశాంతత చేకూరుతుందని అలాగే మెడిటేషన్ వలన క్రీడాకారులు అందరికీ ఇంద్రియ నిగ్రహం కలుగుతుందని, ఆలోచన శక్తి పెంపొం దుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో కోచ్‌లు మొహమ్మద్ ఖలీలు ల్లా, భరణికాన హారిక, పి.మౌనిక, ఇతర కోచ్‌లు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

అద్దె బకాయి దుకాణాలు సీజ్

విశాలాంధ్ర -విజయనగరం: దీర్ఘకాల అద్దె బకాయిలు ఉన్న దుకాణాలను విజయనగరం నగరపాలక సంస్థ సహాయ కమిషనర్ కిల్లాన అప్పలరాజు నేతృతంలోని రెవెన్యూ బృందం సీజ్ చేసింది. బుధవారం ఐడిఎస్ఎంటి షాపింగ్ కాంప్లెక్స్ లో ఉన్న 18 దుకాణాలు దీర్ఘకాల బకాయిలు ఉన్నట్లు గుర్తించారు. అధిక మొత్తంలో బకాయి పడ్డ దుకాణాలను ఈరోజు మూసివేసి తాళాలు వేశారు. ఈ సందర్భంగా సహాయ కమిషనర్ కిల్లాన అప్పలరాజు మాట్లాడుతూ దీర్ఘకాలంగా అద్దె బకాయిలు ఉన్న వాటిపై చర్యలకు ఉపక్రమించామన్నారు. బకాయిదారులకు ఎన్నిసార్లు నోటీసులు జారీ చేసినా స్పందన కాన రాలేదన్నారు. దీంతో కమిషనర్ పల్లి నల్లనయ్య ఆదేశాలతో దుకాణాలను మూసి వహించామన్నారు. ఇప్పటికైనా స్పందించి అద్దె బకాయి పడ్డ దుకాణదారులు పూర్తిస్థాయిలో అద్దెలు చెల్లించాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో రెవిన్యూ ఇన్స్పెక్టర్లు సాయిప్రసాద్, చిన్నం నాయుడు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

యోగాపై ప్రజలకు అవగాహన కల్పించాలి

విశాలాంధ్ర - వంగర: యోగా మనిషి జీవన విధానాన్ని మెరుగు పరుస్తుందని,అందుచేత యోగా(యోగాంధ్రా)పై ప్రజలకు అవగాహన కల్పించాలని ఎంపిడిఓ రఘునాదాచారి కోరారు. బుధవారం మండల పరిషత్ సమావేశ మందిరంలో సమావేశం నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలు మేరకు జిల్లా కలెక్టర్ సూచనలతో యోగా ఆంధ్రపై జూన్ 21న 11వ అంతర్జాతీయ యోగా దినం సందర్భంగా ముందుగా ఈ రోజు నుంచి జూన్ 21 వరకూ ఈ నెల రోజులు యోగపై అవగాహన కల్పించనున్నట్టు తెలిపారు. యోగా వల్ల మానసిక ప్రశాంత ఏర్పడడం ఖాయమన్నారు. 27 జిల్లాలో నెల రోజులపాటు యోగాంధ్ర పేరుతో ప్రచార కార్యక్రమాలు ఈ రోజు నుంచి నిర్వహిస్తున్నట్టు తెలిపారు.

నేలకూలిన మహావృక్షం

తొలగించిన నగరపాలక సంస్థ ప్లాంటేషన్ సిబ్బంది

విశాలాంధ్ర - విజయనగరం: ఎన్నో ఏళ్ల నాటి మహావృక్షం నేల కూలడంతో నగరపాలక సంస్థ ప్లాంటేషన్ సిబ్బంది తొలగించి వేశారు. మహారాజా సంగీత నృత్య కళాశాల ఆవరణలో ఉన్న మహా వృక్షం నేల కూలిందన్న సమాచారం తెలుసుకున్న కమిషనర్ పల్లి నల్లనయ్య సిబ్బందిని అప్రమత్తం చేశారు. దీంతో ఈరోజు ఉదయం నుండి ప్రత్యేక సిబ్బంది వృక్షాన్ని ముక్కలు ముక్కలుగా చేసి రహదారికి అడ్డంకులు లేకుండా చేశారు. ఈ ప్రక్రియను కమిషనర్ పల్లి నల్లనయ్య దగ్గరుండి పర్యవేక్షించారు. వాస్తవానికి మహావృక్షం ఎన్నో ఏళ్ల నాటిది కావడంతో వృక్ష మొదళ్ళలో చెదలు పట్టి పుచ్చిపోయినట్లుగా సిబ్బంది గుర్తించారు. దీంతో కొద్దిపాటి తేలిక వర్షానికి మహావృక్షం కూలిపోయింది. సంగీత కళాశాల ప్రహరీ గోడ ధ్వంసం అయింది. గోడకి అనుకొని ఉన్న మూడు దుకాణాలు పూర్తిగా దెబ్బతిన్నాయి. ఈ సందర్భంగా కమిషనర్ పల్లి నల్లనయ్య మాట్లాడుతూ మహావృక్షం కూలిందన్న సమాచారం తెలిసిన వెంటనే సిబ్బందిని అప్రమత్తం చేసామన్నారు. రహదారికి ఇబ్బందులు లేకుండా ప్రత్యేక ఉడ్ కట్టర్ల సహాయంతో రహదారి పై పడిన చెట్టును తొలగించి వేయడం జరిగిందన్నారు. వృక్షం తొలగింపులో కృషి చేసిన సిబ్బందిని అభినందించారు.

కరాటేలో సత్య డిగ్రీ, పీజీ కళాశాల విద్యార్థులకు పతకాలు

విశాలాంధ్ర - విజయనగరం టౌన్: సత్య డిగ్రీ, పీజీ కళాశాలలో కోచ్ సంతోష్ ఆధ్వర్యంలో కరాటేలో శిక్షణ పొందుతున్న విద్యార్థులు ఇటీవల విజయనగరంలో రాజీవ్ గాంధీ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో జరిగిన 18వ జిల్లా కరాటే ఛాంపియన్షిప్ 2025లో బాలబాలికలు విజయం సాధించారు. ఈ పోటీలను విజయనగరం జిల్లా కరాటే అసోసియేషన్ వారి ఆధ్వర్యంలో నిర్వహించటం జరిగింది. ఈ పోటీలలో కాటా, కుంటిలో పతకాలు సాధించిన విద్యార్థుల వివరాలు క్రింది విధంగా ఉన్నాయి. కే.స్నేహ - రెండు బంగారు పతకాలు, ఎన్.దేవాన్ష్ నాయుడు - రెండు బంగారు పతకాలు, కె.భువన కృతి - బంగారు, రజిత పతకాలు, పి.హేమంత్ - రజిత , బంగారు పతకాలు, పి.కుశ్వంత్ కుమార్ - బంగారు, కాంస్య పతకాలు, జి.తిరుమల - బంగారు, కాంస్య పతకాలు, ఎల్.జస్వంత్ - రజిత, కాంస్య పతకాలు, జి.వివేక్ వర్మ - రజిత, కాంస్య పతకాలు, ఆర్.వైష్ణవి - బంగారు పతకం, కే.శివ గణేష్ - బంగారు పతకం, ఎం.హర్షవర్ధన్ - బంగారు పతకం సాధించారు. ఈ

సందర్భంగా సత్య కళాశాలలో ఏర్పాటు చేసిన అభినందన సభలో కళాశాల సంచాలకులు డాక్టర్ ఎం.శశి భూషణ రావు విద్యార్థులకు అభినందనలు తెలుపుతూ ఈ కరాటేలో ఇంకా రాణించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం వి సాయి దేవ మణి, కోచ్ కె.సంతోష్ కుమార్ అసిస్టెంట్ కోచ్ సుధీర్ భార్గవ్ పాల్గొన్నారు.

ముగిసిన కర్లాం గ్రామ దేవత పండుగ

విశాలాంధ్ర - చీపురుపల్లి: కర్లాంలో గ్రామ దేవత ఉత్సవం వైభవంగా ముగిసింది. విజయనగరం జిల్లా, చీపురుపల్లి మండలం, కర్లాం పంచాయతీ గ్రామంలో 18 సంవత్సరాల తర్వాత గ్రామస్తులు పెద్దలు సహాయ సహకారాలతో ఘనంగా జరుగుతున్న శ్రీ శ్రీ శ్రీ ఆసిరితల్లి గ్రామదేవత పండుగ మహోత్సవంలు ఘనంగా ముగిసాయి. కర్లాం గ్రామ దేవత పండగ మహోత్సవ కార్యక్రమంలో చివరి రోజు అంజలి రథం, సిరిమాను గ్రామం మొత్తం తిప్పి అమ్మవారు భక్తులపై కరుణ కటాక్షాలు చల్లని దీవెనలు ఇవ్వాలని కోరుకున్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న విజయనగరం జిల్లా వై.యస్.ఆర్ కాంగ్రెస్ పార్టీ కార్యదర్శి, చీపురుపల్లి ఎంపీపీ ప్రతినిధి ఇప్పిలి అనంతం, జిల్లా వైసీపీ ప్రచార విభాగం అధ్యక్షులు, చీపురుపల్లి జడ్పీటీసీ ప్రతినిధి వలిరెడ్డి శ్రీనివాసనాయుడు, చీపురుపల్లి మండలం వైసీపీ అధ్యక్షులు, సీనియర్ లీడర్ మీసాల వరాహలనాయుడు,

చీపురుపల్లి నియోజకవర్గ వాలంటరీ విభాగం అధ్యక్షులు బెల్లాన త్రినాధ్ రావు, వైసీపీ నాయకులు రెడ్డి గోపి, గవిడి సురేష్, గవిడి జీవన్ కల్కి, ప్రభాత్ కుమార్, దన్నాన సత్యం తదితరులు పాల్గొన్నారు. చీపురుపల్లి నియోజకవర్గం, చీపురుపల్లి మండలం కర్లాం గ్రామ దేవత పండగ మహోత్సవ కార్యక్రమంలో పాల్గొని అమ్మవారిని దర్శించుకుని అనంతరం స్థానిక సర్పంచ్ బాణాన శ్రీనివాసరావు, ఎంపీటీసీ బాణాన రమణ ఆహ్వానం మేరకు పాల్గొని వారి నివాసంలో విందుకు హాజరై ఆతిద్యం స్వీకరించారు.

టీడీపీ పార్టీకి పునాది, బలం, శక్తి కార్యకర్తలే.....

మాజీ కేంద్రమంత్రి అశోక్ గజపతిరాజు

విశాలాంధ్ర - విజయనగరం ఫోర్ట్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు నారా చంద్రబాబునాయుదు ఆదేశాల మేరకు విజయనగరం పార్లమెంట్, తెలుగుదేశం పార్టీ "మహానాడు" కార్యక్రమాన్ని జిల్లా అధ్యక్షులు కిమిడి నాగార్జున అధ్యక్షతన ఏర్పాటు చేశారు. పెద్ద ఎత్తున నియోజకవర్గ ప్రజలు కార్యకర్తలు, నాయకులు హాజరయ్యారు. ఈ సందర్భంగా మాజీ కేంద్రమంత్రి అశోక్ గజపతిరాజు మాట్లాడుతూ పార్టీకి పునాది, బలం, శక్తి, కార్యకర్తలే అన్నారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించడం ద్వారా, ప్రభుత్వ పథకాలను ప్రతి ఒక్కరికీ చేరేలా చేయడం, మరియు పార్టీ ఆశయాలను, సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో కార్యకర్తలు, నాయకులు కీలక పాత్ర పోషించాలని సూచించారు. పార్టీ కోసం నీతి, నిజాయితీతో, క్రమశిక్షణతో పనిచేయాలని, పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి బలంగా తీసుకొని వెళ్లాలని కోరారు, మహానాయకుడు ఎన్టీఆర్ 102వ పుట్టినరోజు సందర్భంగా మహానాడు కార్యక్రమం అనేది తెలుగుదేశం పార్టీకి ప్రతీ సంవత్సరం వచ్చే ఒక పండగని, మనందరిది ఒకే కుటుంబమని తెలియజేసారు. పార్టీ మనకేం ఇస్తుందని కాకుండా, పార్టీకి మనమేం చేసాం అనే కోణంలో ప్రతీ కార్యకర్త, నాయకులు ఆలోచన చేయాలనీ

తెలియజేసారు. నిస్వార్థంగా కష్టపడిన ప్రతి ఒక్కరికి పార్టీ పదవులు ఇచ్చి, గౌరవిస్తుందని అన్నారు. ఈ సందర్భంగా జిల్లా అభివృద్ధికి సంబంధించిన పలు తీర్మాణాలు ప్రవేశపెట్టారు. కార్యకర్తలు, నాయకులు వాటిని బలపరిచనందుకు, ధన్యవాదములు తెలియజేసారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వాన్ని అభినందిస్తూ, పార్టీని మరింత బలోపేతం చేయడానికి తమవంతు కృషి చేస్తామని కార్యకర్తలు, నాయకులు సమక్షంలో సంకల్పించారు. ఈ కార్యక్రమంలో ఎచ్చర్ల నియోజకవర్గం శాసనసభ్యులు ఎండి కళా వెంకటరావు, విజయనగరం శాసనసభ్యులు పూసపాటి అతిథి విజయలక్ష్మి గజపతిరాజు, కిమిడి నాగార్జున, కర్రోత్ బంగార్రాజు, తదితరులు పాల్గొన్నారు.

జెడి వలసలో నూతన ట్రాన్స్‌ఫార్మర్ ప్రారంభం

విశాలాంధ్ర - జామి: మండలంలోని జెడివలస గ్రామంలో తెలకలపేట ప్రాంతానికి సంబంధించి విద్యుత్ సరఫరాలో తలెత్తుతుండడంతో గ్రామ సర్పంచ్ చిటికె రెడ్డి రామునాయుడు జడ్పిటిసి గొర్లె సరయు దృష్టికి తీసుకువెళ్లారు. ఈ మేరకు మండల పరిషత్ నిధుల నుండి రెండు లక్షల 30 వేల రూపాయలను కేటాయించి విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేశారు. బుధవారం ఈ ట్రాన్స్‌ఫార్మర్‌ను సర్పంచ్ రామునాయుడుతోపాటు మండల వైసీపీ పార్టీ అధ్యక్షుడు గొర్లె రవికుమార్ తదితరుల సమక్షంలో ప్రారంభించారు.

తాగునీటి సరఫరా వేళల్లో మార్పులు

విశాలాంధ్ర - విజయనగరం: మధుపాడ హెడ్ వాటర్ వర్క్స్ వద్ద జరుగుతున్న పాక్షిక మరమ్మతు పనుల నేపథ్యంలో నగరంలో కొన్ని చోట్ల శుక్ర, శని, ఆదివారాలలో తాగునీటి సరఫరా వేళల్లో మార్పులు ఉండే అవకాశం ఉందని విజయనగరం నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య తెలిపారు. నగరంలోని ఉదయం పూట కొన్ని ప్రాంతాలకు, మధ్యాహ్నం పూట కొన్ని ప్రాంతాలకు నీటి సరఫరా జరుగుతోందన్నారు. అయితే మధుపాడ వద్ద హెడ్ వాటర్ వర్క్స్ వద్ద చేపడుతున్న విద్యుత్తు లైన్ల మార్పుల కారణంగా కొన్ని ప్రాంతాలలో నీటి పంపిణీ వేళల్లో అంతరాయం ఏర్పడుతుందని అన్నారు. వాస్తవానికి ఉదయం పూట నీటి సరఫరా జరిగే ప్రాంతాలలో యధాతధంగా జరుగుతుందని, మధ్యాహ్నం వేళల్లో నీటి సరఫరా జరిగే ప్రాంతాల వేళల్లో మార్పులు వచ్చే అవకాశం ఉందని అన్నారు. కావున ప్రజలు సహకరించాలని కోరారు. తాగునీటికీ ఇబ్బంది లేకుండా అవసరమైన వారికి

వాటర్ ట్యాంకుల ద్వారా ప్రత్యేకంగా నీటి సరఫరా చేసే ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. కంటోన్మెంట్ ట్యాంక్,బాలాజీ ట్యాంక్, కేఎల్ పురం ట్యాంక్ , అయ్యన్నపేట ట్యాంక్,బీసీ కాలనీ ట్యాంక్ , ఉడా కాలనీ ట్యాంక్,వీటీ అగ్రహారం ట్యాంక్ , మరియు కొత్తాగ్రహారం ట్యాంక్ పరిధిలో ఉన్న ప్రాంతాలలో మధ్యాహ్నం నీటి పంపిణీ వేళల్లో మార్పులు వచ్చే అవకాశం ఉందని తెలిపారు. ఆయా ప్రాంత ప్రజలు సహకరించాలని కోరారు.